

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
8 పేజీలు | మంగళవారం | డిసెంబర్ 5, 2023 | www.navatelangana.com

సిట్టింగ్‌లందరూ ఓటమి..!

- మార్చిన మూడింటిలో రెండు స్థానాల్లో గెలుపు
- ఉమ్మడి జిల్లాలో కారుకు మిగిలింది ఇద్దరు ఎమ్మెల్యేలే
- అనూహ్య ఫలితాలతో కంగుతున్న గులాబీ పార్టీ
- చెరో నాలుగు స్థానాలతో సత్తాచాటిన కాంగ్రెస్, బీజేపీ

రాష్ట్రమంతా ఒక మాదిరి ఫలితాలు వెలువడితే.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మాత్రం అందుకు భిన్నమైన ఫలితాలు రావడం అందరినీ ఆశ్చర్య పర్చింది. ఉద్యమ కాలంతో పాటు దశాద్దం నుంచి అధికారంలో ఉమ్మడి జిల్లాను ఏకఛత్రాధిపృతంతో ఏలిన గులాబీ పార్టీకి తాజాగా ఎదురైన పరిస్థితి ఊహించనిదిగా మారింది. ఆశించిన విధంగా కాకుండా భిన్నంగా ప్రతికూల పరిస్థితులు ఎదురుకావడంతో ఒక్కసారిగా కంగుతిన్నది. పది మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా విజయం సాధించలేదు. పదింటిలో మూడు స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చి ఇతరులకు టికెట్లు కేటాయించగా రెండు స్థానాల్లో అభ్యర్థులు విజయం సాధించారు. ఖానాపూర్‌లో మాత్రం ఫలితంగా ప్రతికూలంగా వచ్చింది. ఆసిఫాబాద్, బోథ్‌లతో మాత్రమే గెలిచి పరువు నిలబెట్టుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ మిగితా ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలందరూ ఓటమి పాలు కావడంతో ఆ పార్టీ జీర్ణించుకోలేకపోతోంది. ఇక కాంగ్రెస్, బీజేపీలు చెరో నాలుగు స్థానాలు దక్కించుకొని సత్తా చాటాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో అనూహ్య ఫలితాలు వెలువడ్డాయి. మూడోసారి గెలిచిన రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి వస్తామని భావించిన గులాబీ పార్టీకి ఓటర్లు ప్రతికూల తీర్పునిచ్చారు. దశాబ్దం పాటు అధికారంలో కొనసాగిన ఎమ్మెల్యేలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి పది మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. తాజా ఎన్నికల్లో ఆ పార్టీ అధిష్టానం ఆసిఫాబాద్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చి.. కొత్త వారికి టికెట్లు కేటాయించింది. కానీ తాజా ఫలితాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఏడుగురు ఓటమి పాలయ్యారు. ఇందులో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సైతం ఓడిపోయారు. మరోపక్క సిట్టింగ్‌లను మార్చి మూడు స్థానాల్లో ఆసిఫాబాద్, బోథ్‌లో మాత్రం గులాబీ పార్టీకి విజయం దక్కింది. ఆసిఫాబాద్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు కాకుండా జడ్పీ ఛైర్‌పర్సన్ కోవ లక్ష్మికి, బోథ్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు స్థానంలో నేరడిగొండ జడ్పీటీసీ అనిల్‌జాదవ్‌కు టికెట్లు కేటాయించగా తాజా ఎన్నికల్లో ఈ ఇద్దరూ విజయం సాధించి గులాబీ పార్టీ పరువు నిలిపారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఖానాపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు కాదని..కేటీఆర్‌కు సన్నిహితుడనే కారణంగా

మిగతా..2లో...



ముక్కోణపు పోటీనే కలిసొచ్చిందా...?

- బీజేపీ గెలుపుకు అదే కారణమా!

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుండి ఇద్దరు బలమైన అభ్యర్థులు బరిలో నిలిచారు. ఆ ఎన్నికలలో మొత్తం 12 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా ప్రధాన పోటీ మాత్రం కోనేరు కోనప్ప(టీఆర్ఎస్), పాల్వాయి హరీష్‌బాబు(కాంగ్రెస్) మధ్యే నెలకొంది. అప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పకు 82,957 ఓట్లు రాగా, హరీష్‌బాబుకు 58,813 ఓట్లు వచ్చాయి. దీంతో 24,144 ఓట్ల మెజార్టీతో కోనప్ప విజయం సాధించారు. ప్రస్తుతం కూడా వీరిద్దరి మధ్యే పోటీ తీవ్రంగా ఉంటుందని భావించారు. కాని ఎన్నికలకు కొన్ని నెలల ముందు నుండే బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఈ నియోజకవర్గంపై దృష్టి సారించి పలుసార్లు పర్యటించారు. చివరికి తాను ఈ నియోజకవర్గం నుండే పోటీ చేస్తున్నట్లు ప్రకటించి, ప్రచారాన్ని ముమ్మరం చేశారు. దీనితో ఇక్కడ ద్విముఖ పోటీ కాస్త త్రిముఖ పోటీగా మారింది. అప్పటి నుండే బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప పలు సభలలో బీజేపీని గెలిపించేందుకే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇక్కడి నుండి పోటీ చేస్తున్నట్లు ఆరోపణలు కూడా చేశాడు. నియోజవకర్గంలో మైనార్టీ ఓటు బ్యాంక్ కీలకం కావడం, తన ప్రత్యర్థి హరీష్‌బాబు బీజేపీలో ఉండడంతో మైనార్టీలు ఏకపక్షంగా తన వైపే ఉంటారని కోనప్ప భావించారు. కాని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బరిలో నిలిచి మైనార్టీలను తనవైపుకు తిప్పుకోవడంతో కోనప్ప ఓటు బ్యాంక్‌కు గండి పడింది. దీనికి తోడు ఎస్సీ సామాజికవర్గం ఓట్లు కూడా పెద్ద మొత్తంలో బీఎస్పీకి రావడంతో

మిగతా..2లో...

సిర్పూరు నియోజకవర్గంలో ఈసారి బీజేపీ గెలుపుకు ముక్కోణపు పోటీనే కారణమా అనే చర్చ సర్వత్రా సాగుతోంది. గత ఎన్నికల్లో తలపడిన ఇద్దరు అభ్యర్థులతో పాటు ఈసారి మరో బలమైన అభ్యర్థి పోటీలో నిలవడం బీజేపీకి లాభం చేకూరిందని భావిస్తున్నారు.



బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ఓడించారు

- బీఎస్పీ సిర్పూర్(టి) అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై బీఎస్పీని ఓడించారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల తీర్పును తాను గౌరవిస్తానని అన్నారు. నిరంతరం ప్రజలను భయపెట్టి, దోపిడీ, భూకబ్జాలకు పాల్పడే వారిని ఓడించామని అన్నారు. రాబోయే రోజులలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తామని అన్నారు. సిర్పూరు వాసులు తనను దత్తత తీసుకున్నారని, ఓడినా ఇక్కడే ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్‌హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా అధ్యక్షులు లెండుగురె శ్యాంరావు, నాయకులు మనోహర్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన ఎజెండా

● పాల్వాయి హరీష్‌బాబు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన ఎజెండాగా ముందుకు పోతామని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలు అని, గెలిచిన తర్వాత అన్ని వర్గాలను కలుపుకొని అభివృద్ధి కోసం ప్రయత్నిస్తానని అన్నారు. ముఖ్యంగా తన గెలుపుకు బెంగాలీలు సహకరించారని, వారికి ఎస్సీ సర్టిఫికెట్, పశ్చిమబెంగాల్‌కు ప్రత్యేక రైలు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. ఓటమి అనంతరం కోనప్ప పలు గ్రామాలలో బీజేపీ కార్యకర్తలపై దాడులు చేయించాడని, పోలీసులు గతంలో మాదిరి ఏకపక్షంగా ఉండరాదని సూచించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన విషయాన్ని పోలీసులు గమనంలో ఉంచుకోవాలని అన్నారు. తన తండ్రి పురుషోత్తంరావు ఆశయ సాధన దిశగా ముందుకు అడుగులు వేస్తానని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కె శ్రీనివాస్, నాయకులు కొంగ సత్యనారాయణ, దోని శ్రీశైలం, సింధం శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, కల్లోల భట్టాచార్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుకు సన్మానం



రెబ్బెన : సిర్పూర్ నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికైన డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబును సోమవారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ బండారి రమేష్‌గౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎలమంచి సునీల్ చౌదరి, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కేసరి నవీన్‌గౌడ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్, నాయకులు జుమ్మిడి అరుణ్, రాంబాబు, జాడి కిశోర్ పాల్గొన్నారు.

గోలేటీలో టీబీజీకేఎస్ శ్రేణుల సంబరాలు

రెబ్బెన : ఆసిఫాబాద్ నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికైన కోవ లక్ష్మి భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా గోలేటి టౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో స్వీట్లు తినిపించుకొని, బాణాసంచా కాల్చి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు, గోలేటి టౌన్ అధ్యక్షుడు మోర్లె నరేందర్, ప్రకాష్‌రావు, టీబీజీకేయస్ మాజీ వైస్ ప్రెసిడెంట్ నలగొండ సదాశివ్, టీబీజీకేయస్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లో బీఎస్పీకి ఆధిక్యం

కాగజ్‌నగర్ : సిర్పూరు నియోజవర్గానికి జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పోస్టల్ బ్యాలెట్‌లో బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధిక్యత సాధించారు. మొత్తం 1161 ఓట్లకు గాను బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు 495, బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్‌బాబుకు 400, బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పకు 235 ఓట్లు వచ్చాయి. ఇతర అభ్యర్థులు కామ్రె నగేష్, జాడి దీపక్, రాంటెంకి అజయ్‌కుమార్, యెల్ములె మనోహర్, దాసరి వెంకటేష్‌లకు ఒక్కొక్కటి చొప్పున, డొంగ్రి ప్రవీణ్‌కుమార్‌కు రెండేసి చొప్పున ఓట్లు వచ్చాయి. నోటాకు మూడు ఓట్లు వచ్చాయి.

ముక్కోణపు పోటీనే కలిసొచ్చిందా..?

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ ఓట్లకు భారీగా గండిపడింది.

భద్రంగానే హరీష్‌బాబు ఓటు బ్యాంక్

గత అసెంబ్లీ ఎన్నికలలో హరీష్‌బాబుకు 58,813 ఓట్లు వచ్చాయి. ఈసారి ఆ ఓటు బ్యాంక్‌ను కాపాడుకుంటే తన గెలుపు సునాయశంగా మారుతుందని మొదటి నుండి హరీష్‌బాబు భావించారు. కాని ఈ ఎన్నికలలో హరీష్‌బాబుకు 63,043 ఓట్లు వచ్చాయి. కాని కోనప్పకు గత ఎన్నికలలో 82,957 ఓట్లు రాగా, ఈ సారి కేవలం 60 వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. 22,957 ఓట్లకు గండి పడింది. బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఈ ఎన్నికలలో 43,589 ఓట్లు వచ్చాయి. కోనప్పకు రావాల్సిన ఓట్లు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మళ్లినట్లుగా స్పష్టంగా అర్థమవుతోంది. ఓట్ల చీలిక కారణంగానే బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్‌బాబు గెలుపు సునాయసంగా మారిందనడంలో సందేహం లేదు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-కాగజ్‌నగర్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలుర విభాగంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో కాగజ్‌నగర్ ఫాతిమా కాన్వెంట్‌కు చెందిన రాహుల్ తహలాని, ఎ.రోహిత్, బి.మణిరాజ్‌లు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. వీరు ఈ నెల 5న గద్వాల్ జోగులాంబ ఇండోర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, క్రీడల అధికారి మీనారెడ్డి, ప్రిన్సిపాల్ సిస్టర్ సాఫల్య, వ్యాయామ ఉపాధ్యాయులు ఏడుకొండలు, కృష్ణప్రసాద్ అభినందించారు.



హాజీపూర్ : విద్యార్థినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు



కాగజ్‌నగర్ : విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

హాజీపూర్ : మండలంలోని గుడిపేట మౌంట్ కార్మెల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎస్. దీక్షిత రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైంది. సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-17 పోటీలలో 800 మీటర్స్‌లో ద్వితీయ స్థానం సాధించింది. హన్మకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ఈ నెల 5,6,7 తేదీల్లో జరిగే ఎస్‌జిఎఫ్ పోటీలలో పాల్గొననుంది. దీక్షితను పీఈటీ నరేందర్, ప్రధానోపాధ్యాయులు సిస్టర్ అల్ఫీ, పాఠశాల సిబ్బంది అభినందించారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు నడవాలి

● గోలేటి బీఎన్‌టీ పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవం

నవతెలంగాణ - రెబ్బెన

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని గోలేటిలో గల బీఎన్‌టీ ప్రాథమిక పాఠశాలలో ఐఆర్‌ఈపీ ఉపాధ్యాయులు సుజాత, స్వప్న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా దివ్యాంగుల పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రభుత్వం నుండి దివ్యాంగుల పిల్లలకు అందించే సేవలు ప్రత్యేక ఉపాధ్యాయులైన ఐఆర్‌పీ ఉపాధ్యాయులు ప్రత్యేక విద్యాబోధనకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం గురించి, పాఠశాలకు రాలేని పిల్లలకు ఇంటి వద్దనే అందిస్తున్న విద్య సౌకర్యాలు, ప్రభుత్వం ద్వారా అందించే ఉపకరణాలు, ఉచిత ఆపరేషన్‌ల గురించి దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులకు క్లుప్తంగా వివరించారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన దివ్యాంగుల చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. దివ్యాంగులు ఎట్టి పరిస్థితుల్లో ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా ప్రతి విషయాన్ని చాలెంజ్‌గా తీసుకొని ముందుకు నడవాలని, పట్టుదలతో ప్రయత్నిస్తే ఏదైనా సాధించగలమే నమ్మకం ప్రతి దివ్యాంగుడికి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.



దివ్యాంగుల పిల్లలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

సిట్టింగ్‌లందరూ ఓటమి..!

(మొదటి పేజీ తరువాయి)

జాన్సన్‌నాయక్‌కు కేటాయించింది. కానీ తాజా ఫలితాల్లో మాత్రం ఆయన ఓటమి పాలుకావడం గమనార్హం. దీన్ని బట్టి సిట్టింగ్‌లను మార్చిన చోట్ల గెలిచిన గులాబీ పార్టీ.. పాత వారికే టికెట్లు ఇచ్చిన ఏడుగురు ఎమ్మెల్యేలు ఓటమి పాలు కావడం ఆ పార్టీ పరిస్థితికి అద్దం పడుతోంది.

వ్యతిరేకతే ఓడించిందా..?

ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ ఓటమికి ప్రజల్లో వారి పట్ల వ్యతిరేకతే కారణమా..అంటే అవుననే సమాధానం మెజార్టీ ప్రజల నుంచి వినిపిస్తోంది. దాదాపు రెండు నుంచి మూడు సార్లు గెలిచిన ఎమ్మెల్యేల పట్ల సహజంగానే వచ్చే వ్యతిరేకతతో పాటు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందకపోవడం వంటి కారణాలు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతకు కారణమయ్యాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరో వైపు కొందరు ఎమ్మెల్యేల్లో అహంభావం పెరిగిపోవడం, కార్యకర్తలు, సామాన్య ప్రజలను పట్టించుకోకపోవడం.. వివిధ పథకాల్లో వారి దగ్గరి మనుషులు, అనుచరులకే పెద్ద పీఠ వేయడం వంటి కారణాలతోనూ జనాల్లో వారి పట్ల వ్యతిరేకతకు కారణమైందని తెలుస్తోంది. మరోపక్క కొన్ని పథకాలు అర్హులైన సామాన్య జనానికి చేరువకాకపోవడం కూడా ప్రతికూలంగా మార్చిందని తెలుస్తోంది. మరోపక్క ఉద్యోగ నోటిఫికేషన్లలోనూ ప్రభుత్వం విఫలం కావడంతో నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. మరోపక్క కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు కూడా ప్రజలను ఆకర్షించడంతో జనాలు హస్తం పార్టీ వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. మరోపక్క ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్, బీజేపీలు చెరో నాలుగు స్థానాలను దక్కించుకోవడం విశేషం. గత ఎన్నికల్లో ఒకే స్థానాన్ని గెలిచిన కాంగ్రెస్.. తాజా ఎన్నికల్లో నాలుగింట విజయం సాధించింది. కానీ 64సీట్లలో అధికారంలోకి వచ్చినప్పటికీ.. ఉమ్మడి జిల్లాలో మాత్రం మరో ఆరు స్థానాలు కోల్పోవడం ఆ పార్టీకి కూడా ఫలితాలు అంత అనుకూలంగా రాలేదని తెలుస్తోంది. మరోవైపు బీజేపీ తొలిసారి నాలుగు స్థానాలను దక్కించుకొని సత్తా చాటడం జిల్లాలో ఆ పార్టీ బలోపేతాన్ని సూచిస్తోంది.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-కడెం

సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఏఎస్సై దేవ్ అన్నారు. సోమవారం మండలంలోని అంబారిపేట్ గ్రామంలో సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై దేవ్ మాట్లాడారు. వాహనదారులు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. వాహనానికి సంబంధించిన ధృవపత్రాలు కలిగి ఉండాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ ద్వారా వ్యక్తిగత సమాచారం అడిగితే చెప్పవద్దని తమ ఫోన్లకు వచ్చే ఎలాంటి ఓటీపీని అడిగినా తెలపకూడదని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడెం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేస్తా..

- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



నవతెలంగాణ-ముధోల్

ప్రజల కోసం అనుగుణంగా పనిచేస్తానని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన బీజేపీ ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌తో పాటు ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు సోమవారం భైంసా పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ముధోల్‌ను నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యేను సన్మానించిన వారిలో మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పీటీసీ లక్ష్మీ నర్సాగౌడ్, సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, మాజీ సర్పంచ్ గంట శ్రీనివాస్, నాయకులు తాటివార్ రమేష్, దశరత్, నవీన్, అనిల్, సంగోళ్ల పోతన్న, గజానంద్ పాల్గొన్నారు.

కుభీర్ :ముధోల్ అసెంబ్లీ నియోజకవర్గం నూతన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను సోమవారం మండలంలోని పార్డి(బి), పల్సి, సోనారి, గోడాపురా, చోండి గ్రామాల్లోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు నా గెలుపుకు కృషి చేశారని అన్నారు. ప్రతి ఒక్కరికి అండగా ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సాయినాథ్, గంగాశేఖర్, సంతోష్ రాథోడ్, శంకర్, గణపతి, పోతన్న, పోశెట్టి, చంద్రకాంత్, మాజీ ఎంపీటీసీ కనోబా, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కుభీర్‌లో ప్రారంభమైన తాళ సప్తమి వేడుకలు



నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని విటలేశ్వర్ ఆలయంలో సోమవారం తాళ సప్తమి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ముందుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విఠల్ రుక్మిణి విగ్రహాలకు ఆలయ పూజారి ప్రత్యేకపూజలు నిర్వహించి తాళ సప్తమి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు నారా పరుశురాం మాట్లాడుతూ ఈ సప్తమి వేడుకలు ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వేడుకలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దీంతో ఈ వేడుకలు వారం రోజుల పాటు కొనసాగించి, ప్రతి రోజు ఆర్యవైశ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించి, ఆలయంలో భజన కీర్తనలు ఉంటాయని అన్నారు. ఈ వేడుకలు చివరి రోజు గ్రామస్తులు అందరూ కలిసి ముగింపు కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మీరా విజయ్ కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పరుశురాం, నాయకులు పుప్పాల పీరాజి, దామాజి వివేకానంద, సూది రాజన్న, నగలింగం ఆర్యవైశ్యులు సంతోష్, ఆనంద్ గ్రామస్తులు ఉన్నారు.

పరాభవంలో ముఖ్య నాయకులు

- అంతర్మథనంలో ఖానాపూర్ అభ్యర్థులు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పలువురు ప్రధాన నాయకులు అవమానాన్ని చవిచూశారు. మొదట ఎమ్మెల్యే రేఖానాయక్‌కు బీఆర్ఎస్ టికెట్టు ఇవ్వలేదు. ఈ పరిణామం ఆమెను ఎంతో కుంగదీసింది. ఎన్నికల బరిలో ఉండలేని పరిస్థతిని కల్పించింది. ఆ కోపంతో ఆమె భర్త శ్యాంనాయక్ కాంగ్రెస్‌లో చేరి ఆసిఫాబాద్ నుంచి టికెట్ తెచ్చుకున్నారు. కాని ఆయన అక్కడ ఓటమిని చవిచూశారు. ఈ పరిణామం రేఖానాయక్‌తో పాటు శ్యాంనాయక్‌కు ఎదురు దెబ్బ తగిలినట్టైంది. రేఖనాయక్‌కు బీఆర్ఎస్ టికెట్ ఇవ్వనందుకు భర్త శ్యాంనాయక్ గెలిచి ఉంటే గంభీరంగా గళం వినిపించే అవకాశం ఉండేది. ఖానాపూర్‌లో కేటీఆర్ సిట్టింగ్‌ను కాదని నియోజకవర్గ ప్రజలకు పరిచయం లేని జాన్సన్ నాయక్‌కు పార్టీ టికెట్ ఇచ్చి బరిలో దింపారు. కాని జాన్సన్ సైతం ఓటమి పాలయ్యారు. జాన్సన్ నాయక్ గెలిచి ఉంటే కొత్తగా వచ్చి తన సత్తా నిరూపించుకున్నాడన్న పేరు దక్కేది. బీజేపీ టికెట్ ఇవ్వలేదన్న కోపంతో పెంబీ జెడ్పీటీసీ జానూబాయి తొందర పాటుగా ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌లో చేరి రాథోడ్‌కు వ్యతిరేఖంగా పనిచేశారు. కాని జాన్సన్ ఓటమితో జానూబాయి రాజకీయ ఉనికిని ప్రశ్నార్థకంగా మారింది. జాన్సన్ ఓటమి జానూబాయి తీసుకున్న తప్పుడు నిర్ణయాన్ని ఎత్తి చూపినట్టైంది. అలాగే ఏపీపీఎస్సీ మాజీ సభ్యులు రవీందర్‌రావు బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకోసం శ్రమించినా ఫలితం దక్కలేదు. జాన్సన్ ఓటమితో ఖానాపూర్‌లో రవీందర్‌రావుకు ఆదరణ లేదని రుజువు చేసుకున్నట్లు అయ్యింది. ఐదేండ్లు పార్టీకి దూరంగా ఉన్న ఆయన వర్గం అంతర్లీనంగా మధనపడుతున్నారు. రేఖానాయక్‌కు వ్యతిరేఖంగా పనిచేసిన రవీందర్‌రావుకు జాన్సన్ ఓటమి పరభవమనే చెప్పాలి. ఎన్నిలకు ఏడాది ముందు వరకు కాంగ్రెస్ పార్టీలో ఉన్న రమేష్ రాథోడ్ బీజేపీలో చేరి పార్టీ టికెట్ సాధించినా.. విజయ తీరాన్ని మాత్రం చేరలేక పోయారు. పార్టీ మారి తప్పుచేశానా..! అనే భావనలో ఆయన ఉన్నారు. ఇలా పైన పేర్కొన్న సదరు నాయకులు ఒకరికొకరు చెప్పుకోలేనీ పరాభవాన్ని చవిచూశారు. ఇప్పుడు వీరి పరిస్థితి స్థానికంగా చర్చనీయంశంగా మారింది.

నిశ్శబ్ధ ఓటుతో గెలిచిన కాంగ్రెస్

- బీఆర్ఎస్‌ను దెబ్బతీసిన అతి విశ్వాసం
- వనరులను సద్వినియోగం చేసుకోని బీజేపీ



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్ లేకున్నా వెడ్మ బొజ్జు పటేల్ ఎమ్మెల్యేగా గెలిచి తన సత్తా నిరూపించుకున్నారు. రాజకీయ అనుభవం లేకపోవడం, ప్రత్యర్థుల తరహా ప్రజాసంబంధాలు లేక పోవడాన్ని చూసి, ఆయనకు గెలిచే అవకాశాలు ఉండవని మొదట అందరూ భావించారు. ఆయన వెంట ఉన్న కొద్దిపాటి క్యాడర్ సైతం ఒక దశలో అపనమ్మకాన్ని ప్రదర్శించారు. ఆర్థికంగా ఏమాత్రం బలంగా లేని వెడ్మ బొజ్జు కోసం ప్రచారం చేయడానికి పలువురు కార్యకర్తలు సైతం నిరాసక్తి కనబరిచారు. అయినా ఆయన అధైర్య పడకుండా తన ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

అండగా నిలిచిన ఆదివాసులు...

నియోజకవర్గంలో మెజార్టీ ఓట్లు ఆదివాసీ సామాజిక వర్గానివే ఉంటాయి. వారంతా ఈసారి ఎవరు ఎన్ని ప్రలోభాలు పెట్టినా లొంగకుండా ఏకపక్ష నిర్ణయాన్ని తీసుకున్నారు. దీంతో బొజ్జు పటేల్ బలమైన ప్రత్యర్థులను వెనక్కి నెట్టేసి విజయం సాధించారు.

బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టిన అతి విశ్వాసం..

బీఆర్ఎస్ నాయకులు ప్రదర్శించిన అతి విశ్వసమే ఆపార్టీ అభ్యర్థి జాన్సన్ నాయక్ ఓటమికి కారణంగా పరిశీలకులు చెబుతున్నారు. వందల సంఖ్యలో కార్యకర్తలు ఉన్నా కూడా ఓట్లను రాబట్టడంలో పూర్థిగా విఫలమయ్యారు. చిన్న కార్యక్రమాన్ని సైతం భారీ స్థాయిలో ప్రదర్శన చేయడాన్ని ప్రజలు నిరాకరించారు. ఆర్థిక వనరులతో ఏదైనా చేస్తామన్న ప్రచారం చివరి రోజుల్లో తీవ్ర నష్టానికి కారమైనట్లుగా చెబుతున్నారు. అప్పజెప్పిన బాధ్యతను కార్యకర్తలు సరిగా నిర్వర్తించక సొంతానికి తపించడం, పార్టీలో సీనియర్, జూనియర్‌ల విభేదాలు, ప్రజలకు అందుబాటులో ఉండని వారు ఎన్నికలప్పుడు పెత్తనం చేయడం వంటి అంశాలు బీఆర్ఎస్ అభ్యర్థి ఓటమికి ప్రధాన కాణంగా పేర్కొంటున్నారు.

అవకాశాన్ని జారవిడిచుకున్న బీజేపీ ..

బీజేపీ అభ్యర్థి రాథోడ్ రమేష్ రాజకీయ అనుభవం, బీజేపీ పట్ల ప్రజలకు ఉన్న ఆదరణను సరిగా సద్వినియోగం చేసుకోవడంలో నాయకులు పూర్తిగా విఫలమయ్యారు. యువకులు స్వచ్ఛందంగా ప్రచారం చేసినా పార్టీ కార్యకర్తలు మాత్రం ఎన్నికలకు ముందు నుంచే అభ్యర్థి గెలిచిన భావనను ప్రదర్శించారు. అభ్యర్థి చుట్టూ అంతా తమదే అన్నట్లుగా తిరగడం తప్పితే క్షేత్రస్తాయిలో సరిగా పనిచేయని కారణంగానే బీజేపీ అభ్యర్థి మూడోస్థానానికి పరిమితమైనట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

బీజేపీ కార్యకర్తల పాదయాత్ర

నవతెలంగాణ-కుభీర్

ముధోల్ నియోజవర్గంలో మొట్టమొదటి సారిగా బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రామారావు పటేల్ భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా సోమవారం మండలంలోని బెల్గాం గ్రామ బీజేపీ కార్యకర్తలు మండలానికి సరిహద్దులో ఉన్న మహారాష్ట్రలోని పాలజ్ గణేష్ దర్శనానికి పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 10 సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఎలాంటి పథకాలు అందకుండా కేవలం పార్టీ కార్యకర్తలకు మాత్రమే లబ్ది చేయడంతో ఈ సారి ఎట్టిపరిస్థితిలో ముధోల్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేసేలా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేశారని అన్నారు. మండలంలో బీజేపీ 6000 ఓట్ల ఆధిక్యం అందించి వారి గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. దీంతో మండలాన్ని మరింతగా అభివృద్ది పర్చుకునేలా కృషి చేస్తామని అన్నారు. అనంతర పాలజ్ గణేష్‌ను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బెల్గాం బీజేపీ కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.



ప్రజల తీర్పును స్వాగతిస్తున్నాం : గజేందర్


మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదే గజేందర్

నవతెలంగాణ-బోథ్

రాష్ట్రం, బోథ్ నియోజకవర్గంలో ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అడే గజేందర్ అన్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడం పట్ల సంబరాలు జరుపుకున్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని, వంద రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. కార్యకర్తలు ఎవరు అధైర్య పడవద్దని, బోథ్ అభివృద్ధికి మరింత కష్టపడి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ కమిటీ అధ్యక్షులు ప్రఫుల్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మండల కన్వీనరులు కుర్మే మహేందర్, వసంత్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, మైనారిటీ సెల్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి షేక్ నాజర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్ రెడ్డి, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రమేష్, నాయకులు అరుణ్ రెడ్డి, రహిమొద్దీన్, అబ్రార్, అవేజ్, గాజుల పోతన్న, శేఖర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

ప్రజల మధ్యనే ఉంటూ సమస్యలను తీరుస్తాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలతోనే ఉంటూ ప్రజా సమస్యలను తీరుస్తామని, పెండింగ్‌లో ఉన్న పనులను తమ ప్రభుత్వ హయాంలో పూర్తి చేసేలా కృషి చేస్తామని డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకులు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కంది శ్రీనివాస్‌రెడ్డి ఓటమి పాలైనప్పటికి నైతికంగా గెలిచామన్నారు. ఊహించిన దానికంటే ఎక్కువ ఓట్లు వచ్చాయని తెలిపారు. ఆరు గ్యారంటీ హామీలను వంద రోజుల్లోనే అమలు చేస్తామని పేర్కొన్నారు. ఇన్ని రోజులు అవినీతి పాలన సాగిందని, ఉద్యోగాలను అమ్ముకుని అర్హులైన నిరుద్యోగ యువతను జోగు రామన్న మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన కోసం కృషి చేస్తామన్నారు. ఉద్యమ కారులను దూరం పెట్టడం వల్లనే జోగు రామన్న ఇవాళ ఓటమి చవిచూసారన్నారు. ఆయన ఇక మానసిక క్షోభ అనుభవించక తప్పదన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే విధంగా చూస్తామని తెలిపారు. సాగునీటి అవసరాలు తీర్చే విధంగా శాయశక్తుల కృషి చేస్తామన్నారు. ఎన్నికల్లో సహకరించిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మీడియా సమావేశంలో అసెంబ్లీ యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, సోషల్ మీడియా యూత్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు రవి, నాయకులు రవి, లింగన్న, మన్సూర్, రాజ్ మహమ్మద్ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాలూరి గోవర్ధన్ రెడ్డి

స్త్రీ హింస నిర్మూలనే లక్ష్యంగా అవగాహన



అవగాహన కల్పిస్తున్న సఖి కేంద్రం, మహిళ సాధికారత కేంద్రం సిబ్బంది

నవతెలంగాణ-తలమడుగు

స్త్రీలపై జరుగులున్న హింసాలను నిర్మూలనే లక్ష్యంతో క్షేత్రస్థాయిలో ప్రచారం కల్పిస్తున్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 తేదీ వరకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే సోమవారం దేవాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సఖి కేంద్రం, డీహెచ్ఈడబ్ల్యూ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. విద్యార్థులు, గ్రామ మహిళలకు హింసాలతో పాటు వారికి ఉన్న చట్టాల గురించి తెలియజేశారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సాకేంతికత పెరుగుతున్న మహిళలు, చిన్నారులపై హింసాలు, అఘాయిత్యాలు ఆడగం లేదని సఖి కేంద్రం సెంటర్ అడ్మినిస్ట్రేటర్ సరస్వతి అన్నారు. లింగ వివక్షత లేకుండా చూడాలన్నారు. అదే విధంగా సఖి కేంద్రం ద్వారా అందించే ఐదు సేవల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది కృష్ణవేణి, కోటేశ్వర్, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఉత్సవ సమితి సభ్యులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నియోజకవర్గ నూతన ఎమ్మెల్యేగా గెలుపొందిన పాయల్ శంకర్‌కు పలువురి నుండి అభినందనల వెల్లువెతుతున్నాయి. ఇందులో భాగంగానే సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు సోమవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కలిసి పూలబొకే అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. తన గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్యవాదలు తెలిపారు. హిందూ పండుగలను సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా జరుపుకునేల ఉత్సవ సమితి ప్రత్యేకంగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి గెడాం మాధవ్, గౌరవ అధ్యక్షులు ఈర్ల సత్యానారాయణ, ప్రఫుల్ కుమార్ వార్ఘే, సభ్యులు తోట పరమేశ్వర్, బండారి దేవన్న, సాయి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓపెన్ స్కూల్(టాస్) విధానంలో ఇటీవల నిర్వహించిన పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖధికారి ప్రణీత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫలితాల కోసం ఈ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణఓపెన్‌స్కూల్.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, విద్యార్థులు ఫలితాలు చేసుకోవచ్చని తెలిపారు. వెబ్‌సైట్‌లో ఉంచిన మార్క్ మెమోలో ఏవైనా పొరపాట్లు ఉంటే 21లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం 16 వరకు మీ సేవ ద్వారా ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-తాంసి

బోథ్ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిచిన అనిల్ జాదవ్‌ను సోమవారం మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నేరడిగొండలోని ఆయన నివాసంలో తాంసి జెడ్పీటీసీ, ఎంపీపీ, మండల కన్వీనర్, సర్పంచులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఎన్నికల సమయంలో ఎంతో కష్టపడి గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, ఓటర్లకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ అరుణ్, సర్పంచులు సదానందం, వెంకన్న, కృష్ణ, కేశవరెడ్డి, నాయకులు ఉన్నారు.



రెండు కళాశాలల మధ్య సంయుక్త ఒప్పందం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్, గిరిజన సంక్షేమ డిగ్రీ గురుకుల కళాశాల మధ్య సంయుక్త అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఐదేళ్ల ఈ ఒప్పందంలో భాగంగా సంయుక్తంగా సెమినార్లు, కార్యశాలలు నిర్వహించనున్నారు. అధ్యాపకులు విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు చేపట్టనున్నారు. పరిశోధనల్లో సహకారం, సమన్వయం చేసుకోనున్నారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్, గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న అవగాహన ఒప్పంద పత్రాలను కళాశాలలో మార్చుకున్నారు. ఇది ఇరు కళాశాలల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని అంటున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జాకీర్ హుస్సేన్, రడాపు సంతోష్ కుమార్, నర్సింగరావు, రమేశ్, అనిత, జోత్స్న, దయాకర్, తిరుపతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మీని సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-నార్నూర్

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మీని మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం ఆసిఫాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసిన నాయకులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించి స్వీటు తినిపించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేల తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్ నాయక్, సర్పంచులు రాథోడ్ విష్ణు, రాథోడ్ రవీందర్, రాథోడ్ సావిందర్, ఎంపీటీసీలు రేణుక దిలీప్, కళావతి ఉత్తం ఉన్నారు.




కేవీకేకు ఉపాధ్యాయులుగా ఎంపిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల విడుదలైన కేంద్రీయ విద్యాలయాల ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో టీచర్ ట్రైనింగ్ శిక్షణ పొందిన ఏడుగురు ఉపాధ్యాయులుగా ఎన్నికయ్యారని డైట్ ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన వారిలో రాథోడ్ శ్రీకాంత్, ఆత్రం విజ్ఞానిక, రాథోడ్ సౌజన్య, మనీషా, సంధ్య, ఆత్రం పవన్, రాథోడ్ ఆర్తి ఉన్నారు. ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, లెక్చరర్స్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

బోథ్ ఎమ్మెల్యేను సన్మానించిన ఎల్‌బీఆర్



నవతెలంగాణ-తలమడుగు

బోథ్ ఎమ్మెల్యేగా నూతనంగా ఎన్నికైన అనిల్ జాదవ్‌ను మాజీ విజయ డెయిరీ చైర్మెన్ లోక భూమారెడ్డి సత్కరించారు. సోమవారం ఎమ్మెల్యే నివాసంలో కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా ఎల్‌బీఆర్ కోరారు. యువ నాయకుడిని నియోజకవర్గ ప్రజలు ఎన్నుకున్నారని, వారి నమ్మకాన్ని కాపాడేల మరింత అభివృద్ధి చేయాలన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మావల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అభిమాన్ ఆదివారం హఠాత్తుగా గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు గంగారెడ్డి, నల్ల రాజేశ్వర్, దుగ్గలి రాజేశ్వర్ ఉన్నారు.



నువ్వు మాకు ఎంత దూరమో.. మేము నీకు అంతే దూరం..!

● స్వయంకృతాపరాధమే సుమన్ ఓటమికి కారణం

● వ్యక్తిగతానికి తోడు ప్రభుత్వ వ్యతిరేకత



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్‌లో బాల్క సుమన్ ఎందుకు ఓడిపోయాడు..? అంటే ఎంత మాత్రం తడబడకుండా అందరి నోట వినిపించే ఏకైక పదం ఆయన ఎవ్వరికి అందుబాటులో ఉండడు.. ఈ మాట ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చింది కాదు. గత కొంత కాలంగా నాయకులు బహిరంగంగా చర్చించుకోవడం ప్రచారంగా మారింది. ఫలితంగా సుమన్ ఓటమికి కారణమైందని చెప్పవచ్చు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యునిగా నియోజకవర్గానికి పరిచమైన సుమన్ 2018 ఎన్నికల్లో చెన్నూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. స్థానికేతరుడైనా యువకుడు ఉద్యమకారుడిగా భావించిన నియోజకవర్గ ప్రజలు సుమన్‌ను 28 వేలపై చిలుకు మెజార్టీతో గెలిపించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. స్థానికేతరుడైనా సరే యువకుడు విద్యాధికుడైన సుమన్ ఎమ్మెల్యేగా గెలిస్తే స్థానికంగా ఉండి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటాడని భావించారు. కాని ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి నియోజకవర్గ ప్రజలకు దూరంగా హైదరాబాద్‌కు పరిమితమై రాకపోకలు కొనసాగించడం ఇక్కడి ప్రజలకు కొంత అసంతృప్తిని మిగిల్చింది. దీనికి తోడు స్వంత పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ పదవలు అనుభవిస్తున్న నాయకులు సైతం సుమన్ అందుబాటులో ఉండడు, ఉన్నప్పుడు కలిసి మాట్లాడాలని ప్రయత్నించినా అవకాశం ఇవ్వడని నాయకులు బహిరంగంగా చర్చించుకోవడం సుమన్‌కు ప్రజలను దూరం చేస్తూవచ్చింది. ఫలితంగా నువ్వు మాకు ఎంత దూరమో.. మేము నీకు అంతే దూరమన్నట్టు రెండవ సారి ఎన్నికల భరిలో నిల్చిన సుమన్‌కు బదులుగా ప్రత్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి వైపు నిల్చి భారీ మెజార్టీతో గెలిపించారు. అలాగని నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టలేదా..? అంటే అభివృద్ధి జరిగిందన్న అభిప్రాయాలు లేకపోలేదు.. గతంతో పోల్చితే చెన్నూర్ నియోజకవర్గంలో గడిచిన ఐదేండ్లలో ఒకింత అభివృద్ధి జరిగిందన్న వాదనలు ఉన్నాయి. ప్రభుత్వ పథకాలు పంపిణీ చేయడంలో ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పటికప్పుడు అధికారులతో చర్చించి పరిష్కారమార్గాలు చూపినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

'ప్రభుత్వ వ్యతిరేకత కొంత తోడైంది'

చెన్నూర్‌లో బాల్క సుమన్ ఓడిపోవడానికి తన వ్యక్తిగత వ్యవహారంతో పాటు ప్రభుత్వంపై వచ్చిన వ్యతిరేకత కొంత తోడైంది. ప్రధానంగా రుణ మాఫీ ఐదేండ్లైనా పంపిణీ చేయకపోవడం, రైతు బందు సకాలంలో అందకపోవడం, డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించకపోవడం నియోజకవర్గ ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేక భావం పెరుగుతూ వచ్చింది. దీనికి తోడు దశాబ్దాల క్రితం పంపిణీ చేసిన ప్రభుత్వ భూములను ప్రభుత్వ అవసరాల పేరుతో తిరిగి తీసుకోవడం, ధరణి ఏర్పాటుతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని భావించిన రైతులకు అదనపు ఇబ్బందులు తెచ్చిపెట్టడం ఇబ్బందులకు గురి చేసింది. కొత్త రేషన్ కార్డులు, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు మంజూరు చేయకపోవడం ప్రభుత్వ పట్ల కొంత వ్యతిరేకతను తీసుకొచ్చింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడం, విద్యుత్ చార్జీలు, బస్సు చార్జీల పెంపు, ప్రధానంగా ఉద్యోగావకాశాలు కల్పించపోవడం నిరుద్యోగులు తీవ్రమైన వ్యతిరేకతను తీసుకొచ్చింది. అంతిమంగా రాష్ట్రంలో ప్రభుత్వంలో మార్పు తీసుకురావాలన్న సంకల్పం ప్రజల్లో బలంగా నాటుకుంది.

ఎమ్మెల్యేను సన్మానించిన దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్



నవతెలంగాణ-నార్నూర్

ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల శంకర్ భారీ మెజారిటీతో గెలుపొందారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే పాయల శంకర్‌కు దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి స్వగృహంలో ఆయనతో పాటు వారి దంపతులకు శాలువాతో సన్మానించారు. జిల్లాను అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్లాలని కోరారు. వారి వెంట దివ్యశ్రీ ఫౌండేషన్ సభ్యులతో పాటు పలు నాయకులు ఉన్నారు.

ఏలేటి గెలుపుతో చామన్‌పల్లిలో మహన్నదానం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

బీజేపీ నిర్మల్ ఎమ్మెల్యేగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందడంతో మండలంలోని చామన్‌పల్లి గ్రామంలో సోమవారం బీజేపీ నాయకులు స్థానిక రామాలయంలో సత్యనారాయణ వ్రతం చేసి మహన్నదానం చేశారు. గ్రామస్తులతో పాటు చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు బీజేపీ నాయకులు, మహేశ్వర్‌రెడ్డి అభిమానులు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో మార వెంకటరెడ్డి, న్యాయవాది కొమ్మోజి రమణ, శ్రీనివాస్, చిన్న మల్లేష్, మహేష్, సాగర్‌రెడ్డి, సాయన్న, ప్రశాంత్‌రెడ్డి, రమేష్, నారాయణ, అఖిలేష్, లింగారెడ్డి పాల్గొన్నారు.

వెడ్మ బొజ్జు పటేల్‌ను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు

● ఎంపీపీ ఆంటోని అలెగ్జాండర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఆంటోని అలెగ్జాండర్

నవతెలంగాణ-కడెం

ఖానాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా వెడ్మ బొజ్జు పటేల్‌ను గెలిపించినందుకు ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలకు ఎంపీపీ ఆంటోని అలెగ్జాండర్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం మండలంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గంలో బరిలో మహా నాయకులు ఉన్నప్పటికీ నిరుపేద ఇంటి బిడ్డ ఇందిరమ్మ ఇంటిలో నివసిస్తున్న వెడ్మ బొజ్జు పటేల్‌ను ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందించడం చాలా హర్షించదగ్గ విషయమని అన్నారు. ఖానాపూర్‌లో ప్రజాస్వామ్యాన్ని గెలిపించారని అన్నారు. దీనికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి రేవంత్‌రెడ్డి ముఖ్య భూమిక పోషించారని వారన్నారు. అనంతరం మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా వెడ్మ బొజ్జు పటేల్ గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక కార్యకర్త, ప్రజలకు, విలేకరులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ప్రొద్దుటూరి సతీష్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు వెంకటేష్, పట్టణ అధ్యక్షులు వాజిద్‌ఖాన్, ముఖ్య నాయకులు కుమ్మరి రమేష్, పడిగెల భూషణ్, ఇస్రు, కట్ల సాగర్, జాడి ఇందూర్, దేవేందర్ గౌడ్, రెంకల రాజన్న, ఆర్క మధు, రహీమ్, బబ్లు, రాజనర్సయ్య పాల్గొన్నారు.

గుర్తింపు సంఘ ఎన్నికల్లో ఏఐటీయూసీని ఆదరించండి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)ని ఆదరించాలని డిప్యూటీ జనరల్ సెక్రటరీలు ముస్కె సమ్మయ్య, వీరభద్రయ్య అన్నారు. సోమవారం ఆర్కే-6 గనిపై జరిగిన ఫిట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక హక్కులు సొకర్యాలే ధ్యేయంగా దశాబ్దాల ఉద్యమ చరిత్ర కలిగిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎన్నికలలో ఎలాంటి పొత్తులు లేకుండా ఒంటరిగా బరిలో దిగుతుందని, కార్మిక వర్గ మద్దతుతో నాలుగవసారి గుర్తింపు సంఘంగా గెలవబోతున్నట్టు పేర్కొన్నారు. సంఘ నాయకుల త్యాగాల పునాదులపై నడుస్తున్న ఈ సంఘం చేసినటువంటి పోరాటాల ద్వారా, నాయకుల బలిదానాల ద్వారా మాత్రమే గని కార్మికులు శాశ్వత హక్కులను అనుభవిస్తున్నారు. ప్రధానంగా దీపావళి బోనస్, దసరా అడ్వాన్స్, కార్మికులకు పెన్షన్, లాభాల వాటా ఉన్నాయన్నారు. ఇవే కాకుండా వందలాది అగ్రిమెంట్ల ద్వారా అన్ని వర్గాల కార్మికులకు క్యాడర్ స్కీమ్, పర్సనల్ ఉద్యోగులకు హక్కులు సాధించి పెట్టడం జరిగిందన్నారు. కార్మికులందరూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌కు ఓటు వేయడం ద్వారా అనేక హక్కులు సాధించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కమిటీ సమావేశంలో మైనింగ్ స్టాఫ్ ఏరియా ఇన్‌ఛార్జి మారేపల్లి బాపు, ఆర్‌కే సిక్స్ పిట్ కార్యదర్శి సంగం సదానందం, ఆర్కే-5 కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, కాంట్రాక్ట్ కార్మిక సంఘం, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఆర్కే సిక్స్ పిట్ నాయకత్వం గౌరవ అధ్యక్షులు బాలసాని లక్ష్మణ్, ఉపాధ్యక్షులు చిలుక రామచందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక శ్రీనివాసనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం టౌన్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరితా తనిఖీలు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన ఫుడ్ రిజిస్టర్‌లను పరిశీలించారు. అలాగే ప్రభుత్వం నుండి వచ్చే గుడ్లు, పాలు, బాలామృతం సమయానికి అందుతున్నాయా లేదా అని గర్భిణీలను, బాలింతలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గర్భిణీలు బాలింతలు తీసుకునే ఆహారం విషయంలో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో సత్తా చాటిన ఆదర్శ విద్యార్థులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభకనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌లో తెలంగాణ రాష్ట్ర 7 బ్లాక్ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో అండర్-17 బాలుర విభాగంలో పాఠశాలకు చెందిన ఆర్.షణ్ముఖ తేజ, వి.మోక్షిత్ సాయి, ఎండి.మాజ్, రోహిత్, రోహన్, ఎండి.తౌఫీక్, ఎం కార్తీక్, సిద్ధు, ఏ.అభిలాష్, ఎన్.నందకిషోర్‌లు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించారన్నారు. విద్యార్థుల అభివృద్ధి కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీబీ.తిరుపతి, ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రేమ్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 8న సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ 8వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం ఉంటుందని గతంలో తీసుకున్న నిర్ణయాలపై సమీక్ష సమావేశం, మండలంలో చేపట్టే అభివృద్ధి పనుల కోసం భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని తెలిపారు. వివిధ శాఖల మండల అధికారులు గతంలో చర్చించిన తీర్మానాలు ఏ మేరకు నెరవేరాయో సంబంధిత పత్రాలను ప్రజా ప్రతినిధులకు అందజేయాలని, సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యుడు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని తెలిపారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో సంబరాలు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని వివిధ గ్రామాల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి గెలుపొందడంతో సోమవారం బీఆర్ఎస్ నాయకులు బాణాసంచాలు పేల్చి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు, జడ్పీటీసీ అజయ్‌కుమార్ ఎమ్మెల్యే కోవలక్ష్మి గెలుపు కోసం పాటుపడిన ప్రజలకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి సమస్యలున్నా వాటి పరిష్కారానికి, మండల అభివృద్ధికి అన్నివేళల అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడిస్తేనే రాజ్యాంగ పరిరక్షణ

- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్
- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశంలో బీజేపీని ఓడిస్తేనే రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమవుతుందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్ అన్నారు. సామాజిక న్యాయం దళితుల హక్కులు రాజ్యాంగం రిజర్వేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దేశ వ్యాప్త ధర్నాలో జిల్లా నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతరాజ్యాంగ స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తున్న బీజేపీని తిరిగి అధికారంలో రాకుండా ఓడిస్తేనే రాజ్యాంగాన్ని కాపాడుకోగలమని అన్నారు. అట్టడుగు వర్గాలైన దళితుల్లో చైతన్యం కల్పించడం కోసం ప్రజాసంఘాలు సామాజిక సంఘాల ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేస్తున్నామన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల మీద పెద్ద ఎత్తున దాడులు దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. భారత రాజ్యాంగ హక్కులను అమలు చేయడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం సిద్ధపడడం లేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ఎత్తివేయాలని కుట్ర చేస్తుందని కార్పొరేట్ బహుళ జాతి కంపెనీలకు ఒత్తిడికి తలొగ్గి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం ప్రభుత్వ రంగ పెట్టుబడులను ఉపసంహరించుకోవడం చేస్తుందన్నారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్

నవతెలంగాణ-లక్సెట్టిపేట

కాంగ్రెస్ విజయానికి కారకులైన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల గెలుపు కోసం పనిచేసి విజయానికి కారకులైన ప్రతి, లక్సెట్టిపేట మండల, పట్టణ, గ్రామ, వార్డు సభ్యులు ప్రతి ఒకరికి కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, చూపించిన పోరాటం, చొరవ ఓటరు మహాశయులు కాంగ్రెస్‌కు ఓటు వేసేలా అన్ని విధాలా శ్రమించారని, డిసెంబర్ 3న ఫలితాలలో ఆఖండ మెజారిటీతో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్ సాగర్ రావు గెలుపు కోసం పోరాటం చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకే ఈ విజయం అంకితం ఇవ్వనున్నట్లు తెలిపారు. అందరం కలిసి నియోజకవర్గంను అభివృద్ధి చేసుకుందాం అని అన్నారు. అలాగే రాష్ట్రంలో అధికారం ఏర్పాటు చేసే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.

కాసిపేట : కాంగ్రెస్ గెలుపు కోసం పని చేసిన కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం కాసిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నం ప్రదీప్ మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ వెంకటస్వామి విజయం కోసం పాటు పడిన కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు ముఖ్యంగా ఓటు వేసిన ప్రజానీకానికి మండల కాంగ్రెస్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య, మాజీ సహకార సంఘం అధ్యక్షుడు వంశీధర్‌రావు, కోఆప్షన్ సభ్యులు సిరాజ్ ఖాన్, ఎస్సీ సెల్ మండల మండల అధ్యక్షుడు గోలేటి స్వామి, ముత్యంపల్లి టౌన్ అధ్యక్షుడు మైదం రమేష్, తోడేటి కృష్ణ, అప్పని ప్రభాకర్, మెడ రాంచందర్, దారవేని రాజయ్య, రేషవేని బాపు, మంద వేంకటేష్, గుండా రాజ్ కుమార్, అరె సునీత, దుర్గం ప్రవీణ్, ప్రేమకుమార్, జాడి శివ, పిడుగు మనోహర్, సంకురి రాజ్ కుమార్, బోయిని మల్లేష్, బోయిని మహేష్, సల్లూరి సమిల్, వేల్పుల కిరణ్, పులగం వెంకన్న పాల్గొన్నారు.



కాసిపేట

ఘనంగా సంఘమిత్ర వార్షికోత్సవం



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి సింగరేణి సేవా సంస్థ వారి సంఘమిత్ర ధ్యాన కేంద్రం 7వ వారోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన సంఘమిత్ర సభ్యులు ప్రపంచ శాంతి పర్యావరణ సమతుల్యత కోసం సామూహికంగా ధ్యానం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాస్టర్ ఏలేటి లక్ష్మణ్ మాట్లాడుతూ 2015లో సింగరేణి సేవా సంస్థ సహకారంతో సంఘమిత్ర ధ్యాన కేంద్రాన్ని నిర్మించడం జరిగిందన్నారు. ధ్యాన విశిష్టతను ప్రజలకు తెలియజేస్తూ శాఖాహార జగత్తు సహకారమయ్యే విధంగా సంఘమిత్ర ధ్యాన కేంద్ర సభ్యులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో శాంతి భావనను పెంపొందించేందుకు అహింస మార్గాలను బోధిస్తూ శాఖాహార ర్యాలీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ధ్యాన ప్రచారంలో భాగంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య పరిస్థితులు కుటుంబ పరిస్థితుల దృశ్య మానసిక ప్రశాంతతకు ప్రతి ఒక్కరు ధ్యానం చేయవలసిన అవసరం ఏర్పడిందని తెలిపారు. ప్రస్తుతం బెల్లంపల్లిలో 20 ధ్యాన కేంద్రాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. కొత్తగా ధ్యానంలోకి వచ్చిన వారికి ఉచితంగా ధ్యాన బోధ చేయడం జరుగుతుందన్నారు. సంఘమిత్ర ధ్యాన కేంద్రంలో ఏసీతో పాటు అన్ని వసతి సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోహర్, మల్లేష్, చంద్రయ్య, ముత్తె మొగిలి, వనజ, రమేష్, పావని పాల్గొన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
మంగళవారం డిసెంబర్ 05, 2023

ఘనంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని నీల్వాయి గ్రామంలో మాజీ జడ్పీటీసీ నీల్వాయి ఎంపీటీసీ రుద్రభట్ల సంతోష్ కుమార్, నీల్వాయి సర్పంచ్ గాలి మధు, వేమనపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటి పుట్టిన రోజును నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ ఫోన్‌లో మాట్లాడుతూ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలియచేసారు.



సేవకు మెచ్చి.. పట్టం కట్టి..!

- పదేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపట్టిన ప్రేమ్ సాగర్ రావు
- రికార్డ్ స్థాయిలో మెజారిటీ సొంతం
- బీఅర్ఎస్, బీజేపీలు కలిపి 80 వేలు దాటని వైనం
- ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ ఉనికిని కాపాడిన పీఎస్ఆర్
- మంత్రి వర్గంలో చోటు దక్కుతుందనే ధీమా

మంచిర్యాల నియోజకవర్గ ప్రజలు సామాజిక సేవా కార్యక్రమాలను మెచ్చి కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు పట్టంగట్టారు. 66116 అత్యధిక మెజార్టీతో మంచిర్యాల ఎమ్మెల్యేగా గెలిపించారు. 2018 ఎన్నికల్లో గెలుపుకు దగ్గరగా పోయి కేవలం 4వేల ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి చెందారు. అయినా నియోజకవర్గ ప్రజలకు నిరంతరం సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన చేసిన సేవాకార్యక్రమాలను గుర్తించి గెలిపించేందుకు నిర్ణయించారు. ఒక లక్ష ఐదు వేల ఓట్లు వేసి పల్లె పట్టణం అని తేడా లేకుండా ఓట్ల వర్షం కురిపించారు. ఆయన సతీమణి డీసీసీ అధ్యక్షురాలు సురేఖ చరిష్మా, బలమైన క్యాడర్‌తో ఈ సారి గెలుపు నల్లేరు మీద నడక అయింది. మంత్రి వర్గంలో చోటు దక్కే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం అవుతోంది.



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లాలో మూడు నియోజకవర్గాలు వున్నాయి. బెల్లంపల్లి, చెన్నూర్ ఎస్సీ రిజర్వ్‌డ్, మంచిర్యాల జనరల్ స్థానంలో కాంగ్రెస్ నుంచి బలమైన అభ్యర్థి మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ పోటీ చేసారు. గతంలో ఎమ్మెల్సీగా చేసిన అనుభవం, గత పర్యాయం ఎమ్మెల్యేగా స్వల్ప ఓట్లతో ఓటమి చెందిన కానీ కుంగి పోకుండా మరుసటి రోజు నుండే నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. సేవా గుణం కలిగిన వ్యక్తిగా పేరున్న ప్రేమ్ సాగర్ రావుకు ఈ ఎన్నికల్లో గెలుపు సునాయాసం అని ముందుగానే కాంగ్రెస్ వర్గాలు, సర్వేలు తేల్చి చెప్పారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఐదేళ్లుగా నియోజకవర్గంలో ప్రతి గడపను తాకుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వచ్చే ఎన్నికల్లో ప్రేమ్ సాగర్‌రావును గెలిపించాలని ముమ్మర ప్రచారం చేశారు. పీఎస్సార్ కూడా అన్ని గ్రామాలలో పర్యటిస్తూ అనురచులను కాపాడుకుంటూ వచ్చారు. బలమైన క్యాడర్‌ను తయారు చేసుకున్నారు. నియోజకవర్గంలో పీఎస్ఆర్ అంటే తెలియని వారు లేరనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఏ శుభకార్యం అయిన ఈయనకు ఆహ్వానం అందుతుంది. ఆయన వెంట ఒక సైన్యంలా అనుచర గణం వుంటూ వస్తుంది. ఆయన వాహన శ్రేణి చూస్తే అధికారంలో ఉన్న మంత్రుల లాగా వుంటుంది. అవసరాల కోసం ఆయన గడపతొక్కే వారికి బరోసా కల్పిస్తూ వచ్చారు.

సేవా కార్యక్ర మాలే గెలుపుకు నాంది..

ప్రేమ్ సాగర్ రావు పదేళ్ల క్రితం తన తండ్రి కొక్కిరాల రఘుపతి రావు పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృత సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రతి బతుకమ్మ పండుగకు ఆడపడుచులకు చీరలు బహుమతిగా అందిస్తున్నారు. నిర్మాణంలో వున్న దేవాలయాలకు విరాళాలు అందజేస్తున్నారు. మరణించిన కుటుంబాలకు బేధాలు లేకుండా ఆర్థిక సహాయ చేస్తున్నారు. ఆస్పత్రిలో అత్యవసర చికిత్స తీసుకుంటున్న వారికి వేలల్లో సహాయం చేస్తూ, పై ఆసుపత్రులకు దగ్గరుండి రిఫర్ చేపిస్తు ప్రాణాలకు రక్షించే కార్యక్రమాలు చేపడుతున్నారు. బతుకమ్మ, క్రిస్మస్, రంజాన్ పండగలకు నిత్యావసర సరకుల పంపిణీ చేస్తున్నారు. కరోనా సమయంలో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల బంధువులకు 19 వేల మందికి బోజనాలు పంపిణీ చేశారు. ఎమ్మార్పీ ధరలకే రేమిడిసివియర్ ఇంజెక్షన్లు అందజేశారు. ఆక్సిజన్ సిలిండర్లు దొరకని సమయంలో కూడా సిలిండర్లు సొంత ఖర్చులతో అందించారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు 1600 యూనిట్ల రక్తాన్ని బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు. క్రీడ పోటీలు ఏర్పాటు చేస్తూ సామగ్రి అందజేస్తున్నారు. ఇప్పటికీ ఎండాకాలంలో మంచిర్యాల పట్టణంలో 10 ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తున్నారు.

ఘన విజయం..

మంచిర్యాల ఎమ్మెల్యే గా ప్రేమ్ సాగర్ రావు 66116 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 274807 ఓట్లుకు గానూ 190058 ఓట్లు పొలయ్యాయి. అందులో ప్రేమ్ సాగర్ రావుకు 105945 ఓట్లు రాగా పత్యర్తులు బీజేపీకి 39829, బీఅర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే దివాకర్ రావుకు కేవలం 37989 ఓట్లు మాత్రమే వచ్చాయి. పల్లెలు పట్టణాలు, కార్మిక ప్రాంతాలు అనే తేడా లేకుండా ప్రతి చోట మెజారిటీ ఓట్లు వేశారు. ఉమ్మడి జిల్లాలోనే రికార్డ్ మెజారిటీ దక్కింది. దీంతో ఆయనకు మంత్రి వర్గం చోటు దక్కుతుందని ప్రచారం జరుగుతుంది. పదేళ్లుగా అధికారంలో లేకున్నా కానీ వుమ్మడి అదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ ఉనికిని కాపాడరనే పేరుంది. కార్యకర్తలను కాపాడుకుంటూ వచ్చి ఇప్పుడు జిల్లాలో 4 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపుకు కృషిచేశారు.

జన్నారంలో కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ

నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా వెడ్మా బొజ్జు గెలవడంతో మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ ర్యాలీ కాంగ్రెస్ కార్యాలయం నుంచి అంగడి బజార్ మీదుగా తెలంగాణ తల్లి విగ్రహం వరకు డప్పు వాయిద్యాలతో డీజే సౌండ్‌లతో, ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జరుగుతున్న సందర్భంలో స్థానిక పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, మాట్లాడుతూ దొరల తెలంగాణకు చమర గీతం పాడి కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించిన మండల ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్రంలో కూడా పార్టీ అధికారంలోకి రావడం అభినందనీయమన్నారు. ఆరు గ్యారంటీ స్కీంలను తప్పకుండా అమలు చేసే విధంగా పార్టీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మాణిక్యం, జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్ మామిడి పెల్లి ఇంద్రయ్య, పసియుల్లా, దాముఖ కరుణాకర్, మత్స్య శంకరయ్య, ఎన్ఎస్‌యూఐ నాయకులు సోహెల్‌షా, అజ్మత్, దుమల రమేష్, శిరీష్, ప్రశాంత్, ముత్యం రాజన్న, గంగన్న, గూగులవత్ రవి, ప్రదీప్ పాల్గొన్నారు.

అదనపు ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నవతెలంగాణ-తాండూర్

పిల్లలకు అదనపు ఆహారాన్ని అందించడం ద్వారా పిల్లల్లో సంపూర్ణ ఆరోగ్యం తో పాటు ఎదుగుదల వృద్ధి చెందుతుందుతందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమతా అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి గ్రామాపంచాయతీ లోని రెపల్లెవాడ అంగన్‌వాడీ సెంటర్‌లో సామాజిక అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు చనుపాలతో పాటు ఆరు నెలల తర్వాత అదనపు ఆహారాన్ని అందించాలని సూచించారు. ఉడికించిన పప్పులతో పాటు అన్నాన్ని నుజ్జుగా చేసి ఉగ్గుగా తినిపించడం ద్వారా పిల్లల్లో ఎదుగుదల బాగుంటుందని తెలిపారు. పిల్లలకు అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పిల్లలకు బాలామృతం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శ్యామల పాల్గొన్నారు.

పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో పోలీసుల తనిఖీలు

నవతెలంగాణ-వేమనపల్లి



డిసెంబర్ 2 నుంచి 8 వరకు మావోయిస్టు పార్టీ పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) వారోత్సవాల సందర్భంగా సోమవారం నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సై సుబ్బారావు సోమవారం తనిఖీలు నిర్వహించారు. నీల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫారెస్ట్ రోడ్ గుండా ఆర్ఓపీ నిర్వహణ, గ్రామాల పరిధిలోని బ్రిడ్జ్, కల్వర్ట్‌లను, ఆకస్మిక తనిఖీ, ఏరియా డామినేషన్, ఫెర్రీ పాయింట్స్‌లను అనుమానిత ప్రదేశాలను తనిఖీ చేశారు. పడవల ద్వారా ప్రయాణం చేసే వారితో మాట్లాడి, వారిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్ మట్లాడుతూ యువకులు సంఘ విద్రోహ శక్తులకు సహకరించవద్దని అన్నారు. పీఎల్‌జీఏ వారోత్సవాల సందర్భంగా ఈ నెల 8 వరకు తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రజలకు రక్షణ, భద్రత కల్పించడమే పోలీసుల ధ్యేయమన్నారు. మావోయిస్టుల ప్రలోభాలకు లొంగకుండా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అదేవిధంగా మీ నివాస ప్రాంతాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించినట్లయితే స్థానిక పోలీస్‌లకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

ప్రజాసమస్యలపై కమ్యూనిస్టుల పోరు ఎప్పటికీ ఆగదు

నవతెలంగాణ-జన్నారం



తెలంగాణ రాష్ట్రంలో నవంబర్ 30న జరిగిన ఎన్నికలు, డిసెంబర్ 3న వెలుబడిన ఫలితాలు ప్రజాస్వామ్యంలో అహంకార వైఖరిని ప్రజలు అంగీకరించరనే విషయాన్ని వెల్లడించే విధంగా ఉన్నాయని సీపీఐ కార్యవర్గ సభ్యుడు కలిందర్ అలీ ఖాన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో విలువలతో కూడిన పాలన ముఖ్యమని, ప్రజా గొంతుకగా చట్ట సభల్లో సీపీఐ తమ గళాన్ని వినిపించేందుకు ప్రజలు అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో సీపీఐ మిత్రపక్ష కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలు అధిక మెజారిటీతో గెలిపించడం, కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గెలుపుకు సహకరించిన ప్రజలకు పార్టీ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. నియంతలా, నిరంకుశంగా పాలన సాగించిన పాలకులకు ఈ ఎన్నికలు గుణపాఠాన్ని నేర్పాయని, ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తే సహించేది లేదన్నరు. ఆత్మగౌరం కోసం, ఆత్మగౌరవ పరిపాలన కోసం తెలంగాణ ప్రజలు ఎప్పుడు పోరాటంలో ముందుంటారని తెలిపారు. ఎర్ర జెండా పార్టీలు ఎప్పుడు అధికారం కోసం తాపత్రయపడవని, ప్రజల సమస్యలపై, ప్రజా సంక్షేమంపై పోరాటాలు సాగిస్తాయని అన్నారు. ఓడితే గెలువచ్చని, పడితే లేవచ్చని, కాని లాలుచీపడితే చరిత్ర క్షమించదని, అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల కోసం కాకుండా ప్రజలకు సుపరిపాలన అందాలనే లక్ష్యంతో ఒక్క సీటుకు కట్టుబడి రాష్ట్రంలోని 119 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలువుకు పార్టీ శ్రేణులు కృషి చేశాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రజల ఆకాంక్ష నెరవేర్చే దిశగా పాలన అందించడానికి తమ వంతు పోరాటాలు ఉంటాయని, నేడు ఏర్పడిన ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు పాలన అనిదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల కన్వీనర్ మామిడి విజయ్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు మిట్టపెల్లి పౌలు, దేవి పొచన్న, చాడ మహేందర్ రెడ్డి, భాను పటేల్, రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, కాంగ్రెస్ నాయకులు మత్స్య శంకరయ్య మిక్కిలినేని రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జర్నలిస్టు జేఏసీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నియోజకవర్గ నూతన ఎమ్మెల్యేగా గెలుపొందిన పాయల్ శంకర్‌ను జర్నలిస్టు జేఏసీ మర్యాద పూర్వకంగా కలిసింది. సోమవారం జేఏసీ కన్వీనర్ నుకల దేవేందర్, కోకన్వీనర్ బీర్యాకర్‌వార్ వెంకటేష్‌ల నేతృత్వంలో పలువురు జర్నలిస్టులు ఆయన స్వగృహంలో పాయల్ శంకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను జేఏసీ కన్వీనర్ ఎమ్మెల్యే వివరించగా, వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫరులు ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన సీపీడీ బృందం



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సీపీడీ బృందం సోమవారం సందర్శించారు. పాఠశాలలోని బోధన తీరు విద్యార్థి రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అర్థంకాని విషయాలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి సబ్జెక్టుపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సీపీడీ బృందం సభ్యులు గిరిష్, సంతోష్, ప్రతాప్, అజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రావ్, ఉపాధ్యాయులు వినోద్ రెడ్డి, మురళీధర్ పాల్గొన్నారు.

విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలి



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని స్థానిక ఆదర్శ పాఠశాలను జాయింట్ డైరెక్టర్ సరోజినీ సోమవారం సందర్శించారు. పాఠశాలలోని రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. భవిష్యత్తులో ఉపయోగపడేలా తమ జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలన్నారు. పది, ఇంటర్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధనలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎలాంటి సమస్యలున్న ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాన్నారు.

సింగరేణిలో మోగిన ఎన్నికల నగారా

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన పిమ్మట సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల డిసెంబర్ 27న జరగనున్నాయి. సోమవారం హైదరాబాదులో డిప్యూటీ సిఎల్‌సి వద్ద జరిగిన సమావేశంలో అన్ని యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్మికులకు సంబంధించిన ఓటర్ లిస్టులను డిప్యూటీ సీఎల్సీ అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో సింగరేణి కార్మికులు టీబీజీకేఎస్‌ను ఆదరిస్తారో లేదో వేచి చూడాల్సిందే. కాంగ్రెస్ ప్రభుత్వంఅధికారం చేపట్టింది కాబట్టి ఐఎన్టీయూసీకి ఆదరణ లభిస్తుందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆదిలాబాద్‌ను మోడల్ జిల్లాగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే పాయల్ శంకర్
- మీ వెంటే ఉంటూ సమస్యలను పరిష్కరిస్తా
- నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాను మోడల్ జిల్లాగా అభివృద్ధి చేస్తానని, ప్రజల సమస్యలను తీర్చేందుకు ఎల్లప్పుడూ అందరికి అందుబాటులో ఉంటానని, పెండింగ్‌లో ఉన్న ఆదిలాబాద్ ఎయిర్ స్ట్రిప్, ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వే లైన్ పనులను సత్వర పరిష్కారం కొరకు ప్రయత్నం చేస్తానని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పదిహేను సంవత్సరాలుగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జోగురామన్న నియోజకవర్గ ప్రజలకు ఎన్నో ఇబ్బందులకు గురిచేసి భయానక వాతావరణాన్ని సృష్టించారని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తలు ఎవరైనా చురుకుగా ఉంటె వారిని బెదిరిస్తూ లోబర్చుకొనే ప్రయత్నం చేసారన్నారు. బీజేపీ కార్యకర్తలు ఎన్నడూ జోగురామన్నకు, బీఆర్ఎస్ నాయకులకు బయపడలేదని, వారి మీద అట్రాసిటీ కేసులు, డమ్మీ కేసులు ఇలా వారి జీవితాన్ని దుర్భరం చేసిన తమ నాయకులు ఎన్నడూ అధైర్య పడకుండా తన వెంటే ఉంటూ గెలుపులో కీలక పాత్ర పోషించారన్నారు. తన గెలుపుకు కారణమైన ఉద్యోగ, ఉపాధ్యాయాయులకు, వివిధ సామాజిక వర్గాలకు, విశ్రాంత ఉద్యోగులకు, నిరుద్యోగ యువకులకు విజయానికి ప్రత్యక్షంగా పరోక్షంగా మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి తన విజయం అంకితమన్నారు.

ప్రలోభానికి లొంగకుండా ఓటేశారు..

బీఆర్ఎస్,ఎంఐఎం నాయకులు ప్రజలను నానరకాలుగా ఇబ్బంది పెట్టారని బీజేపీకి ఓటేస్తే రైతు బంధు రాదు, పింఛన్లు ఆపేస్తాం, రేషన్ రాదని ఎన్నోరకాలుగా బెదిరించారన్నారు. మరికొందరికి డబ్బు ఆశ చూపి ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిచిన భయపడకుండా డబ్బులు, ప్రలోభ పడకుండా హిందూ బంధువులందరూ ఒక్కటై బీజేపీని గెలిపించారన్నారు.

రిమ్స్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి..

కేంద్ర ప్రభుత్వం కోట్ల నిధులతో రిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను నిర్మించి ఇస్తే గత ప్రభుత్వ అలసత్వం కారణంగా డాక్టర్లు లేక దీనావస్థలో ఉందన్నారు. ఆ ఆస్పత్రిని పునరుద్దరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు లాలా మున్నా, ఆదినాథ్, ఆకుల ప్రవీణ్, లోక ప్రవీణ్ రెడ్డి, అంకత్ రమేష్, కృష్ణ యాదవ్, రత్నాకర్ రెడ్డి, నగేష్, దినేష్ మోటోలియా, మయూర్ చంద్ర పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో సీపీఐ నాయకుల సంబరాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు కొత్తగూడెంలో గెలుపొందడం పట్ల ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ ఆధ్వర్యంలో నాయకులు టపాసులు కాలుస్తూ, స్వీట్లు పంచుకొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ సీపీఐ, కాంగ్రెస్‌ల కలయికను సమర్థిస్తూ తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. మతం ఏజేండాతో వచ్చిన బీజేపీకి తెలంగాణ ప్రజలు తోసిపుచ్చిన తీరును ప్రశంసించారన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అహంకారానికి తగిన గుణపాఠం నేర్పారన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పరిపాలనలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని, కార్మికవర్గానికి హక్కులు లేకుండా చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



తెలంగాణ తల్లి చౌరస్తాలో నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

చేస్తామన్నారు. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్రం, దేశంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు కలసి ప్రజా సమస్యలపై పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులున్నారు.

ఇదే స్ఫూర్తితో పార్లమెంట్ స్థానం కైవసం

- నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో వచ్చిన ఫలితాల స్ఫూర్తితో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభలో తన ప్రసంగంతో ఉమ్మడి జిల్లా ప్రజల మనసులు దోచుకున్నారన్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో నాలుగు అసెంబ్లీ సీట్లు బీజేపీ కైవసం చేసుకుందన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో పార్లమెంటు, ఇతర ఎన్నికల్లో గెలుస్తామని ధీమావ్యక్తం చేశారు. నిర్మల్‌లో చారిత్రాత్మక విజయాన్ని అందించి తనను భారీ మెజార్టీనితో గెలిపించిన నియోజకవర్గం ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీగా ప్రజల గొంతుగా నిలుస్తానని పేర్కొన్నారు. దేశంలో బీజేపీ అందిస్తున్న సుస్థిర పాలనను ఇక్కడి ప్రజలకు అందిస్తానన్నారు. రాష్ట్రంలో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలు, అంశాలు అమలు చేయడం అసాధ్యమని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టడం కోసం ఓటు బ్యాంకుగా మార్చుకొని అధికారంలోకి రాబోతుందని ఆరోపించారు. మరోవైపు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నియంత, నిరంకుశ, కుటుంబ పాలనకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రజాసేవలో ముందుంటూ నిర్మల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు. తన వెంటే ఉంటూ గెలుపుకు కారణమైన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. తొలిసారిగా బీజేపీ పట్టం కట్టిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు అయ్యగారి భూమయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.7